సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ၊ 31 ၊ డిసెంబర్ ၊ 2024



సోమశిలలో 71.939 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 71.939 టీఎంసీల నీరుంది. పైతట్టు ప్రాంతాల నుంచి 4865 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,530
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,130
3 శాతం జీఎస్టీతో	రూ.7,344
నవర (8 గ్రా)	రూ.58,752

గరిష్టం/కనిష్టం
32.0 /23.8

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుందని ఆశాఖాధికారులు తెలిపారు. సోమవారం గాలిలో తేమ 65 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

న్యాయవాదులు కోర్టు విధుల బహిష్కరణ నేడు

నెల్లూరు (లీగల్): అనంతపురం బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి పోలీస్‌స్టేషన్‌లో మృతి చెందడం, రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లి పోలీసులు న్యాయవాది జె.సుదర్శన్‌రెడ్డి పట్ల అమానుషంగా, దౌర్జన్య పూరిత చర్యలకు నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్య యాదవ్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం అత్యవసర కమిటీ సమావేశం నిర్వహించి న్యాయవాదులపై పోలీసుల చట్టవ్యతిరేక చర్యలకు నిరసనగా కోర్టు విధులను బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించామని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

పెద్దాస్పత్రిలో డిప్యూటీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి

నెల్లూరు (అర్బన్): రెండు రోజుల క్రితం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి) అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి సోమవారం ఆస్పత్రిలోని పలు విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రోగుల వార్డులు పరిశీలించారు. పారిశుధ్యం, తాగునీటి వసతి, రోగులకు అందుతున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఓపీలు, డాక్టర్స్ విశ్రాంత గదులు, ఐసీయూ, రక్తపరీక్షలు గదితర వాటిల్లో ఈ తనిఖీలు చేశారు. జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్ర, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ మస్తాన్‌బాషా, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగాధర్ తదితరులు ఆస్పత్రిలోని వార్డులను చూపించి అందుతున్న సేవలను వివరించారు. డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అందులో భాగంగానే ఆస్పత్రిలోని అన్ని విభాగాలను, పరికరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు అబిదా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

సజ్జాపురం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

నెల్లూరు (పొగతోట): నెల్లూరు రూరల్ మండలం సజ్జాపురం గ్రామ సర్పంచ్ నారాయణ చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీకి సంబంధించిన నిధుల డ్రా చేయడం, ఖర్చు తదితర అంశాలకు సంబంధించి బిల్లులు, ఇతర వివరాలు అందుబాటులో లేవు. ఇందుకు సంబంధించి సర్పంచ్‌ని వివరణ కోరగా ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. దీంతో సర్పంచ్ చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. సాధారణ నిధులు రూ.1,97,750, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,25,019 మొత్తం రూ.3,22,769 డ్రా చేయడం జరిగింది. డ్రా చేసిన నగదుకు సంబంధించి ఏ విధమైన రికార్డులు, ఆధారాలు చూపించడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీంతో నిధులు దుర్వినియోగం అయినట్లు భావించి సర్పంచ్ చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక పంట దిగుబడులు సాధించవచ్చని జిల్లా సహకారశాఖాధికారి (డీసీఓ) గుర్రప్ప అన్నారు. డీసీఓ కార్యాలయంలో సోమవారం దగదర్తికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీసీఓ మాట్లాడుతూ దగదర్తి మండల కేంద్రంగా ఏర్పాటు చేయనున్న ఆర్గానిక్ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం రైతులకు ప్రకృతి వ్యవసాయం అలవాటు చేసి, పెట్టుబడులు తగ్గించి, అధిక దిగుబడులు సాధించేలా చూడాలన్నారు. పంటలకు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన పంటల ద్వారా ఆరోగ్యకరమైన వరిధాన్యం, కూరగాయలు పండించవచ్చన్నారు. పంటల సస్యరక్షణ, పంటల కొనుగోలు, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లను సంఘం ద్వారానే జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఓ కార్యాలయ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నెలనెలా అష్టకష్టాలు

- రేషన్ షాపుల ద్వారా కేంద్రాలకు సరుకుల సరఫరా
- బియ్యం, కందిపప్పు, పామాయిల్ ఒకేసారి రావడం లేదు
- సరుకుల కోసం డీలర్ల చుట్టూ ప్రదక్షణలు

■ కావలి డివిజన్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నవంబర్‌లో 4,250 మంది గర్భిణులకు పరీక్షలు చేయగా, వారిలో 1,035 మందికి రక్తహీనత ఉన్నట్లుగా గుర్తించారు. బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 454 మంది గర్భిణులకు పరీక్షలు చేయగా, 308 మందికి రక్తహీనతతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. దీన్ని బట్టి చూస్తే.. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత, అవగాహన లోపం, పేదరికం, పోషకాహారాల విలువ తెలియక పోవడం తదితర కారణాలతో బాలల తోపాటు గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురవుతున్నారని అర్థమవుతోంది.

రేషన్.. పరేషాన్

చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంరక్షణ, సమగ్ర వికాసానికి దోహదపడాల్సిన అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహించే కార్యకర్తలు నెల నెలా రేషన్ కష్టాలు పడుతున్నారు. అంగన్‌వాడీలకు రేషన్ షాపుల ద్వారా బియ్యం, కందిపప్పు, పామాయిల్ సరుకులు సరఫరా అవుతున్నాయి. అయితే ఇవన్నీ ఒకే సమయంలో రావడం లేదు. బియ్యం మాత్రం రెగ్యులర్‌గా వస్తున్నా.. పామాయిల్, కందిపప్పు అదొకసారి.. ఇదొకసారి వస్తున్నాయి. ఈ మూడు సరుకుల కోసం మూడు సార్లు రేషన్ షాపుల చుట్టూ తిరగడానికి వ్యయప్రయాసలు పడుతున్నారు.



కావలి సీడీపీఓ కార్యాలయం

కావలి: అంగన్‌వాడీ వర్కర్ల విధులు కత్తిమీద సాములా మారాయి. వీరికి అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించడంలో క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న పరిస్థితులను సంబంధితశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంపూర్ణ పోషకాహార లోపం.. పేదరికానికి శాపం కాకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి గర్భస్థ శిశువులు, బాలింతలు, పుట్టిన పిల్లల నుంచి ఆరేళ్ల వయస్సు వచ్చే వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్నాయి. అందులో భాగంగా ఎప్పటికప్పుడు పరిస్థితులను మెరుగుపరిచేందుకు అవసరమైన పర్యవేక్షణకు 'పోషణ్ ట్రాకర్' యాప్‌ను ప్రభుత్వం అమలు పరుస్తోంది. ఈ రికార్డులు ఎప్పటికప్పుడు అమలు చేయాలంటే.. సరుకుల పంపిణీ మీద ఆధారపడి ఉంటుంది. ఈ సమస్యలే.. అంగన్‌వాడీ కార్యకర్తలకు అష్టకష్టాలు తెచ్చి పెడుతోంది.

అంగన్‌వాడీల ద్వారా పోషకాహార కిట్లు

అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ప్రభుత్వం పోషకాహారాన్ని సరఫరా చేస్తోంది. 0–6 ఏళ్ల పిల్లలకు బాలామృతం, పిల్లలు, గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పాలు, బాలసంజీవని కిట్లు అందజేస్తోంది. ఈ కిట్‌లో 2 కేజీల రాగిపిండి, కేజీ అటుకులు, బెల్లం, కర్జూరం, చిక్కీలు పావుకేజీ చొప్పున ఉంటాయి. ఇవన్నీ నేరుగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతుండగా, బియ్యం, ఆయిల్, కందిపప్పు మాత్రం రేషన్ షాపుల ద్వారా సరఫరా అవుతున్నాయి.

నెలకు రూ.వెయ్యి వరకు ఖర్చులు

గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు నేరుగా ప్రాజెక్ట్ సెంటర్ నుంచే సరుకులు వచ్చేవి. వీటిని రిసీవ్ చేసుకున్నట్లు సచివాలయాలకు వెళ్లి థంబ్ వేయాల్సి ఉండేది. ప్రస్తుతం ఆ విధానాన్ని గత ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుతం పాల సరఫరాకు మాత్రమే సచివాలయాల్లో ఉండే మహిళా పోలీస్‌కు ఓటీపీ చెబితే సరిపోతోంది. బియ్యం, నూనె, కందిపప్పు తెచ్చుకోవడానికి మాత్రం అంగన్‌వాడీలకు కష్టాలు తప్పడంలేదు. ఒక గ్రామ పంచాయతీలో కొన్ని చోట్ల మూడు గ్రామాలు ఉన్నాయి. ఈ మూడు గ్రామాలకు ఒకడే రేషన్ డీలర్ ఉంటాడు. మూడు గ్రామాల్లో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. దూరాభారంగా ఉన్న రేషన్ షాపుల నుంచి సరుకులు తెచ్చుకునేందుకు పలుమార్లు తిరగడానికి, ఆటోల చార్జీలకే నెలకు రూ.వెయ్యి వరకు ఖర్చు అవుతుంటే.. ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం ఇచ్చే పరిస్థితి లేదని అంగన్‌వాడీలు వాపోతున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా, పట్టణాల్లో సరుకులు తెచ్చుకోవడానికి ప్రత్యేకంగా ఆటోను తీసుకెళ్లాల్సి ఉంటుంది.

తప్పని మెమోలు..

అంగన్‌వాడీ కార్యకర్తలు రేషన్ సరుకుల కోసం పని వేళల్లోనే డీలర్ల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. వీరు రేషన్‌షాపులకు వెళ్లిన సమయంలోనే సీడీపీఓలు, ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు తనిఖీకి వస్తుంటారు. సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్త అందుబాటు లేకపోవడంతో విజిటింగ్ బుక్‌లో రాయడమే కాకుండా.. అందుబాటులో లేరని మెమోలు జారీ చేస్తున్న పరిస్థితి తప్పడం లేదని అంగన్‌వాడీలు వాపోతున్నారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లు	- 12
అంగన్‌వాడీ కేంద్రాలు	- 2,934
గ్రామీణ ప్రాంతాల్లో	- 2,485
పట్టణ ప్రాంతాల్లో	- 449
	చిన్నారులు
0-6 నెలలు	- 13,954
6-12 నెలలు	- 12,804
1-3 సం॥	- 49,015
3-6 సం॥	- 48,681
మొత్తం	-1,24,454
గర్భిణులు	- 11,663
బాలింతలు	- 13,908

అంగన్‌వాడీ కేంద్రాలకు నెలకు సరఫరా జరిగే సరుకులు

బియ్యం	- 75,452 కేజీలు
కందిపప్పు	- 33,976 కేజీలు
పామాయిల్	- 27,009 లీటర్లు

నెలనెలా తప్పని వ్యయప్రయాసలు

జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 449, గ్రామీణ ప్రాంతాల్లో 2,485 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గతంలో బియ్యం, పామాయిల్, కందిపప్పుతోపాటు బాలామృతం, బాలసంజీవని కిట్లు కూడా నేరుగా ప్రాజెక్ట్ సెంటర్ నుంచే ఆయా కేంద్రాలకు అందుతున్నాయి. కొంత కాలంగా బియ్యం, నూనె, కందిపప్పు మాత్రం రేషన్ షాపుల నుంచి సరఫరా చేసే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ మూడు సరుకులు ప్రతి నెలా తెచ్చుకోవడానికి అంగన్‌వాడీ కార్యకర్తలకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ మూడు సరుకులు ఒకేసారి రేషన్ షాపులకు సరఫరా కావడం లేదు. ఒక్కొక్క దానికి ఒక్కొక్కసారి వెళ్లి తెచ్చుకోవడానికి వ్యయప్రయాసలు పడుతున్నారు.



ముగ్గురు థంబ్ వేయాలి..



అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకులకు సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్త, రేషన్ డీలర్, వీఆర్వో లేదా వీఆర్‌ఏ థంబ్ వేస్తేనే సరుకులు ఇస్తారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే బియ్యం, నూనె, కందిపప్పులకు ప్రత్యేకించి డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్లకు వెళ్లి థంబ్ వేస్తే కానీ షాపులకు సరఫరా కావు. ఆ డీలర్లకు బుద్ధి పుట్టినప్పుడు, వాళ్ల అవకాశాన్ని బట్టి వెళ్లి థంబ్ వేస్తున్నట్లు సమాచారం. ఈ మూడు సరుకులు ఒకేసారి సరఫరా కావడం లేదు. ఒక్కొక్క సరుకు.. ఒక్కొక్కసారి వచ్చినప్పుడు డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్లలో థంబ్ వేయాల్సి ఉంటుంది. దీంతో రేషన్ షాపులకు సరుకులు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి. ఆ సరుకులు వచ్చినా.. తీసుకెళ్లడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు పడే ఇబ్బందులే ఎక్కువ. సరుకులు వచ్చాయా లేదా అని తెలుసుకునేందుకు డీలర్లకు ఫోన్లు చేస్తే.. స్పందించి సమాచారం చెప్పడం లేదు. డీలర్ అందుబాటులో ఉంటే.. వీఆర్వో దొరకరు.. వీఆర్వో ఉంటే.. డీలర్ అందుబాటులో లేని పరిస్థితి. అందరూ అందుబాటులో ఉన్నా.. సాంకేతిక సమస్యలు, సిగ్నల్ సమస్యలతో మరోసారి వెళ్లాల్సి ఉంటుంది. ఈ విధంగా నెలలో మూడు రకాల సరుకులు తెచ్చుకోవడం అంగన్‌వాడీ కార్యకర్తలకు మానసిక ఒత్తిడి, ఆటోల ఖర్చుతో ఆర్థిక భారంగా తయారైంది.

డీలర్ల ద్వారా ఎదురవుతున్న సమస్యలు పరిష్కరిస్తా



అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం, కందిపప్పు, నూనె రేషన్ షాపుల ద్వారా సరఫరా అవుతున్నాయి. వీటిని తెచ్చుకోవడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులు నా దృష్టికి వచ్చాయి. ఒకేసారి అన్ని సరుకులు వచ్చేలా.. చూస్తాను. ఈ సమస్య పరిష్కారానికి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాను.

– సీహెచ్ సుశీలాదేవి, పీడీ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, నెల్లూరు జిల్లా

బోసిపోయిన గోకుల బృందావనం

- ఆ పల్లె జనమంతా యాదవులే..
- మూడేళ్ల వరకు 66 మంది నివాసం.. ప్రస్తుతం రెండు కుటుంబాలే..

» కొన్నేళ్ల క్రితం వరకు నందనవనం

ఆ ఊరంతా యాదవ వంశీయుల స్థిర నివాసం. గోపాలకుల కుటుంబంలో జనియించిన శ్రీకృష్ణుడిని తమ ఇంటి దైవంగా వీరు భావిస్తారు. తమ నివాస ప్రాంతానికి గోపాలకృష్ణుడు కొలువైన 'గోకుల బృందావనం' పేరు పెట్టుకున్నారు. చుట్టూ పచ్చని పంట పొలాలు.. ఊరి నిండా ఆవుల మందలతో ఆ గోకులం కళకళలాడుతుండేది. తరతరాలుగా మారుతున్న వృత్తులు, ఆధునిక జీవన ప్రమాణాలకు గోపాలికలు అతీతులు కాలేకపోయారు. మారుతున్న ప్రపంచంతో పోటీపడుతూ వలస బాట పట్టారు. పూర్వీకుల జ్ఞాపకాలతో అక్కడే బతుకుతున్న మరికొందరు కూడా ఒక్కొక్కరుగా పట్టణాల వైపు వెళ్లడంతో.. ఇప్పుడు ఆ పల్లె బోసిపోయింది.

– సైదాపురం

'గోకుల బృందావనం'.. ఆ పల్లె బోసిపోయింది. సైదాపురానికి కూత వేటు దూరంలోనే ఉండే ఈ ఊరులో అంతా యాదవ వంశీయులే నివశించేవారు. అలనాడు దాదాపు 130 కుటుంబాలు స్థిర నివాసం ఉండే ఆ ఊరు నిండా గోవులు.. పాడి పంటలతో గోపాలకృష్ణుడి బృందావనంగా విరాజిల్లింది. గోపాలికలు మారుతున్న కాలంతో పోటీపడుతూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం ప్రారంభించారు. కాలక్రమేణా.. ఒక్కొక్కరు ఊరికి దూరం కావడంతో మూడేళ్ల క్రితం వరకు 66 మంది జనాభాతో అతి చిన్న పంచాయతీగా ఉండేది. ప్రస్తుతం వారిలోనూ రెండు కుటుంబాలు మినహా.. మిగతా వారంతా సమీపంలోని సైదాపురానికి మకాం మార్చుకున్నారు. ఇప్పుడు ఈ రెండు కుటుంబాలు కూడా వలసకు సిద్ధమవుతున్నాయి. జిల్లాలోని సైదాపురం మండలంలోని గోకుల బృందావనం పల్లె.. అనాథగా మారింది.

ఊరుంది.. రోడ్డుంది..

గోకుల బృందావనం చుట్టు పక్కల అపారమైన ఖనిజ సంపద నిల్వలు కూడా ఉన్నాయి. వందల ఎకరాల భూములున్న ఆ పల్లెలో ప్రస్తుతం పాఠశాల భవనాలు, పంచాయతీ కార్యాలయాలు, పటిష్టమైన సీసీ రోడ్లు పదిలంగా ఉన్నాయి. అయితే జనాలు మాత్రం కనిపించరు. గత చరిత్ర చూస్తే.. గ్రామానికి నలు వైపులా మైకా గనులు విస్తారంగా ఉండడంతో ఆ పల్లెలో 350 మందికి పైగా జీవనం సాగించేవారు. ఇరు వైపులా ఉన్న గనులు పూర్తి స్థాయిలో తవ్వేయడంతో ఆ గ్రామం కూడా రోజు రోజుకు కుచించుకుపోతోంది. చివరకు 66 మంది ఓటర్లుగా మిగిలారు. బత్తలపల్లి, ఆవుల ఇంటి పేర్లతో పాటు దొడ్డగ అనే ఒక ఇంటి వారు మాత్రమే ఉండేవారు. వీరిలో వంతుల వారీగా సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకునే ఆనవాయితీ కూడా ఉండేది. ఈ క్రమంలో ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు విడుదల చేసే నిధులతో కొంత మేర అభివృద్ధి పనులు చేపట్టారు. 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో మాత్రమే ఈ పంచాయతీలో పోటీ జరిగింది. మహిళలకు కేటాయించడంతో ముగ్గురు మహిళలు పోటీ చేశారు. చివరకు ఆవుల రమాదేవి విజయం సాధించారు.



గ్రామంలోకి స్వాగతం పలికే గ్రంథాలయం



గ్రామానికి వెళ్లే మార్గం

జనం వెళ్లిపోయారు..

గోకుల బృందావనం వాసులంతా సైదాపురం తరలివెళ్లి పోయారు. వారంతా మండల కేంద్రం సైదాపురంలోని తహసీల్దార్ కార్యాలయం ఎగువ ప్రాంతంలోని ఎంఎస్ కాలనీలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. కొందరు సైదాపురంలో మరో కాలనీగా ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. చివరకు ఊరిలో మాత్రం కేవలం రెండు ఇళ్లే మిగిలాయి. పల్లె చుట్టూ ఉన్న భూముల్లో అపారమైన ఖనిజ నిక్షేపాలు ఉండడంతో ఆ పల్లెలో ఉన్న వందలాది ఎకరాల భూముల విలువ ప్రస్తుతం రూ.లక్షల్లో పలుకుతోంది. ఎకరా రూ.35 లక్షల వరకు ధర పలుకుతుందంటే అక్కడి భూమి విలువ అర్థమవుతోంది.

మమకారం వదల్లేకున్నాం..



ఊరిపై ఉన్న మమకారం వదలలేక రోజుకోసారి వచ్చి పోతున్నాం. చుట్టుపక్కల ఉన్న మా భూముల్లో సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. నిమ్మ తోటలను పెంచుకుంటున్నాం. ఊరిలోకి వస్తే.. చిన్నప్పటి జ్ఞాపకాలు నేటికీ గుర్తుకు వస్తున్నాయి. మొన్నటి వరకు మా తల్లి కూడా ఊర్లోనే ఉండేది. ఆమెను చూసుకునేందుకు నిత్యం వెళ్తుండే వాళ్లం. ఆమె కూడా ఇటీవల సైదాపురం వచ్చేసింది. ఈ ఊరిలో ఎవరూ నివాసం లేకుండా నిర్మానుష్యంగా మారింది.

– ఆవుల సాంబయ్య

ముప్పై ఏళ్ల క్రితం ఊరి నుంచి వచ్చేశాం



ముప్పై ఏళ్ల క్రితం ముగ్గురు అన్నదమ్ములం కలిసి ఊరి నుంచి సైదాపురానికి కాపురం వచ్చేశాం. అక్కడే పుట్టి పెరిగాం. చదువుల కోసం మేమంతా ఊరు వదిలేశాం. చుట్టు పక్కల కొండలు, కాలువలు, పక్కనే ప్రముఖ పుణ్యక్షేత్రం సిద్ధలయ్య కోన ఉండేది. ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది మా ఊరు. ప్రస్తుతం కళాహీనంగా మారడం చూస్తుంటే బాధ కలిగిస్తోంది.

– దొడ్డగ మునెయ్య

చదువుల కోసం రాక తప్పలేదు



మా చదువుల కోసం మేమంతా ఊరి నుంచి సైదాపురం వచ్చేశాం. ఇక్కడే ప్రభుత్వం స్థలాలు కూడా ఇవ్వడంతో ఇళ్లు కట్టుకున్నాం. ఉన్నత చదువులు చదువుకుని ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నాం. కేవలం చదువుల కోసమే ఊరు వదిలిపెట్టాం. సెలవు దినాల్లో మా ఊరికి వెళ్లి స్నేహితులతో కలిసి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నాం.

– బత్తలపల్లి వీరరాఘవులు

హద్దుమీరితే కఠిన చర్యలు

- ఎస్పీ జి. కృష్ణకాంత్

నెల్లూరు (క్రైమ్): నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో ఇళ్ల వద్దనే సంతోషంగా జరుపుకోవాలని, హద్దుమీరితే చర్యలు తప్పవని ఎస్పీ జి.కృష్ణకాంత్ సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై వేడుకలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం ఆయన ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో నూతన సంవత్సరం సందర్భంగా శాంతిభద్రతలపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 31వ తేదీ రాత్రి నుంచి 2025 జనవరి ఒకటో తేదీ ఉదయం వరకు ప్రధాన కూడళ్లలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. మితిమీరిన వేగం, ట్రిపుల్ రైడింగ్, సైలెన్సర్లు లేకుండా పెద్దపెద్ద శబ్దాలు చేసే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం మత్తులో వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామన్నారు. రాత్రి 10 గంటల్లోపు దుకాణాలన్ని మూసివేయాలని, ప్రభుత్వ నిర్దేశిత వేళల వరకు మాత్రమే మద్యం దుకాణాలు, బార్ల నిర్వహణకు అనుమతిస్తామన్నారు. వేడుకల పేరిట మహిళలు, యువతులను ఈవ్‌టీజింగ్ చేయడం, వారితో అనుచితంగా ప్రవర్తించడం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్, కార్లు నడిపే వారు సీట్ బెల్టు ధరించాలన్నారు. అశ్లీల ప్రకటనలు, పోస్టర్లు నిషిద్ధమని, వేడుకల్లో అశ్లీల నత్యాలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. సమూహంగా వేడుకలు నిర్వహించాలనుకునే వారు ముందస్తుగా స్థానిక పోలీసుల అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులకు గురైనా వెంటనే 112కు ఫోన్ చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

3.09 లక్షల మందికి నేడు పింఛన్ల పంపిణీ

నెల్లూరు (పొగతోట): జిల్లాలో మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ చేపట్టనున్నారు. డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం సోమవా రం సచివాలయాల వారీగా బ్యాంకుల నుంచి నగదు డ్రా చేశారు. జిల్లా వ్యాప్తంగా 3,09,000 మందికి రూ.130 కోట్ల నగదును పంపిణీ చేయనున్నారు. గత నెలలో అనివార్య కారణాలతో పింఛన్ తీసుకోలేని వారికి ఈ నెలతో కలిపి ఇవ్వనున్నారు.

దూరం నుంచి వచ్చి.. వినతులిచ్చి..

- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- 227 అర్జీల అందజేత

నెల్లూరు రూరల్: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జనం పెద్దఎత్తున వచ్చి సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జేసీ కె.కార్తీక్, డీఆర్వో ఉదయ్‌భాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగా భవానీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కాగా ఈ వారం కూడా అత్యధికంగా రెవెన్యూకు సంబంధించిన వినతులు 116 వచ్చాయి. మున్సిపల్ శాఖవి 25, సర్వేవి 22, పంచాయతీ రాజ్‌వి 15, పోలీస్ శాఖవి 10 తదితర వినతిపత్రాలు అందాయి. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజాకుమారి, జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డీటీసీ చందర్, ఏపీ మైక్రో ఇరిగేషన్ పీడీ శ్రీనివాసులు, గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్, డీఈఓ బాలాజీరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.


వృద్ధురాలి సమస్య వింటున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

- నెల్లూరులోని 1, 12వ డివిజన్లలోని గిరిజనులు తమ సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ సంఘం నేత లక్ష్మణ్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఇంటి స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలంటే సచివాలయాల్లో తిరస్కరిస్తున్నారని, దీనిపై దృష్టి సారించాలని కోరారు.
- నెల్లూరు రూరల్ మండలం కొండ్లపూడి పంచాయతీలో 600 మందికి స్థలాలిచ్చారు. చాలామంది ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే రోడ్డు సౌకర్యం లేదని, చర్యలు తీసుకోవాలని కొందరు స్థానికులు కోరారు.
- ఎస్సీ ఉపకులాల జాబితాలను సోషల్ ఆడిట్‌లో భాగంగా సచివాలయాల్లో ఇంకా ప్రదర్శించలేదని, మరింత గడువు కావాలని మాదిగ కుల సంఘాల జేఏసీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు.

52 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. దీనికి జిల్లా నలుమూలల నుంచి 52 మంది విచ్చేసి ఫిర్యాదులు అందజేశారు. వాటిని డీటీసీ డీఎస్పీ గిరిధర్‌రావు పరిశీలించి చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఆదేశించారు.


ఫిర్యాదులను పరిశీలిస్తున్న డీఎస్పీ

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	112
లేయర్ (లైవ్)	95
బ్రాయిలర్ చికెన్	206
బ్రాయిలర్ స్కిన్‌లెస్	226
లేయర్ చికెన్	162

సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు

- ఈ ఏడాదిలో కొట్టేసిన మొత్తం రూ.15.02 కోట్లు
- కూటమి ప్రభుత్వంలో మహిళలపై పెరిగిన నేరాలు
- దొంగతనాల సంఖ్య కూడా ఎక్కువే..

నెల్లూరు(క్రైమ్): ఈ ఏడాది సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు. రూ.15.02 కోట్ల మేర ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. దొంగతనాలు పెరిగాయి. హత్యలు, హత్యాయత్నాలు, మహిళలపై, పోలీసు అధికారులపై దాడులు జిల్లావాసులను కలవరపాటుకు గురిచేశాయి.



పోలీసు రికార్డులకెక్కిన నేరాల సంఖ్య కాస్త తగ్గినట్లు అనిపిస్తున్నా వాటి తీవ్రత మాత్రం ఎక్కువ అన్నది కఠోర సత్యం. తీవ్రమైన కేసుల్లో పోలీసులు సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేపట్టి గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్ట్ చేయడం, లోక్‌అదాలత్‌లో వేల కేసుల పరిష్కారం తదితర విషయాల్లో జిల్లా పోలీసు యంత్రాంగం రాష్ట్ర పోలీస్ బాస్ ప్రశంసలను అందుకుంది. మొత్తంగా ఈ ఏడాది డెకాయిటీ, హత్యాయత్నాలు, హత్యలు, చీటింగ్, లైంగికదాడులు, మహిళలపై దాడులు, రోడ్డు ప్రమాదాలు, దోపిడీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించినవి ఇంకా తదితర కేసులు 3,937 నమోదయ్యాయి.

మహిళలపై..

మహిళలపై కొన్ని నేరాలు పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది 20 మంది హత్యకు గురయ్యారు.

సంచలనం రేకెత్తించిన ఘటనలు

గంజాయి స్మగ్లర్లు బరితెగించారు. ఏకంగా విధుల్లో ఉన్న రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావును వాహనంతో ఢీకొట్టి పరారైన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఆ కేసులో నిందితుడిని గంటల వ్యవధిలోనే పోలీసులు అరెస్ట్ చేశారు. నడిరోడ్డుపై ట్రాఫిక్ మహిళా ఎస్సైపై దాడి జరిగింది. రౌడీషీటర్లు, ట్రాన్స్‌జెండర్ హత్య కేసులు కలకలం రేపాయి.

- ఈ ఏడాది నాలుగు విడతల్లో జరిగిన లోక్‌అదాలత్‌లో 34,065 కేసులను పరిష్కరించి రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. మొబైల్ హంట్ ద్వారా ఏడు విడతల్లో రూ.8 కోట్ల విలువైన మూడు వేల సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించారు.
- ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనులపై 34,780 కేసులు నమోదు చేసి రూ.1,80,43,100ల అపరాధరుసుము విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై 6,334 (డ్రంక్ అండ్ డ్రైవ్) కేసులు, బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై 8,652 కేసులు నమోదు చేశారు.
- గంజాయి అక్రమ రవాణాపై 13 కేసులు పెట్టి 111 కేజీల గంజాయి, 340 మత్తు మాత్రలను స్వాధీనం చేసుకుని 55 మంది నిందితులను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న ఏడుగురి కోసం గాలిస్తున్నారు. మూడు వాహనాలను సీజ్ చేశారు.
- పదేపదే నేరాలకు పాల్పడుతున్న 16 మందిపై సస్పెక్ట్ షీట్లు తెరిచారు. మిస్సింగ్ కేసుల్లో సాంకేతికత ఆధారంగా ఛేదించి బాధిత కుటుంబసభ్యుల చెంతకు చేర్చారు. కావలి పట్టణంలో 14 నెలల బాలుడి మిస్సింగ్ కేసును గంటల వ్యవధిలో ఛేదించారు.
- హత్యలు 43, హత్యాయత్నాలు 116, తీవ్ర దాడులు 56 కేసులు నమోదయ్యాయి. గతేడాదితో పోలిస్తే స్వల్పదాడులు 5.27 శాతం పెరిగాయి. పోక్సో, మహిళల నేరాలకు సంబంధించి 11 కేసుల్లో, రెండు వరకట్న మరణాలు, రెండు హత్యాయత్నం కేసుల్లో నిందితులకు జైలు శిక్షలు పడ్డాయి. డయల్ 112 ద్వారా పలువురిని రక్షించారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మరికొన్ని ఏర్పాటు చేయనున్నారు.

కొల్లగొట్టి..

సైబర్ నేరాలు గతేడాదితో పోల్చి చూస్తే 33.33 శాతం పెరిగాయి. గత సంవత్సరం నేరగాళ్లు రూ.7,27,72,000 సొత్తును కాజేయగా ఈ ఏడాది రూ.15,02,26,000 దోచుకోగా రూ.6,68,13,000 బ్యాంక్‌లో స్తంభింపజేశారు.



విజృంభించిన దొంగలు

జిల్లాలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా దొంగలు విజృంభించి ప్రజల సొత్తును దోచుకెళ్లారు. మర్డర్ ఫర్ గెయిన్ కింద ఎనిమిది కేసులు నమోదయ్యాయి. రాత్రులే కాదు పగలు కూడా దొంగలు యథేచ్ఛగా చోరీలకు పాల్పడ్డారు. పగటిపూట దొంగతనం కేసులు ఈ ఏడాది 33 నమోదయ్యాయి. గతంతో పోల్చి చూస్తే 13.79 శాతం పెరిగింది. సాధారణ దొంగతనాలు సైతం 1.30 శాతం పెరిగాయి.


హరనాథపురంలోని అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన దొంగలు (ఫైల్)


ఇద్దరు దొంగల్ని అరెస్ట్ చేసి వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ సౌజన్య (ఫైల్)

మెరుగైన సేవలందిస్తాం



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

ఈ ఏడాదిలో జరిగిన నేరాలు, రికవరీలు, పోలీసుల పనితీరును సోమవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో ఎస్పీ జి.కృష్ణకాంత్ వెల్లడించారు. మహిళల భద్రతకు పెద్దపీట వేస్తామన్నారు. సాంకేతికతను వినియోగిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఇబ్బందులు, మహిళలు, చిన్నారుల రక్షణ చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సులు విస్తృతం చేస్తామన్నారు. కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకూ అందరం కలిసికట్టుగా పనిచేస్తూ 2025లో జిల్లావాసులకు మెరుగైన సేవలందిస్తామని ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ డి.శ్రీనివాస రెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పెన్నా నదిలో మహిళ మృతదేహం

కోవూరు: ప్రమాదవశాత్తు నీటిలో పడిందో.. లేక ఆత్మహత్య చేసుకుందో తెలియదు గానీ గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని జమ్మిపాళెం వద్ద పెన్నా నదిలో సోమవారం జరిగింది. నదిలో మహిళ మృతదేహాన్ని చూసిన పశువుల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్, వీఆర్వో హరి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మహిళ వివరాలు సేకరిస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.32
సన్నవి : రూ.25
పండ్లు : రూ.15

దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం

- తెల్లవారుజామునే కవాతు మైదానానికి చేరుకున్న అభ్యర్థులు
- 302 మంది గైర్హాజరు
- పర్యవేక్షించిన ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): పోలీస్ కానిస్టేబుళ్ల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు సోమవారం నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో ప్రారంభమయ్యాయి. ఉద్యోగ లక్ష్యాన్ని చేరుకునేందుకు అభ్యర్థులు చలిని లెక్క చేయకుండా తెల్లవారుజామున నాలుగు గంటలకే పోలీసు కవాతు మైదానానికి చేరుకున్నారు. వారి కాల్ లెటర్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం అనుమతించారు. విద్యార్హతలు, రిజర్వేషన్, వయో ధ్రువీకరణ తదితర సర్టిఫికెట్లను పరిశీలించారు. అధునాతన సాంకేతిక నైపుణ్యం కలిగిన డిజిటల్ ఎక్విప్‌మెంట్స్‌ను వినియోగించి అభ్యర్థుల ఎత్తు, ఛాతి కొలతలు నమోదు చేశారు. అందులో అర్హత సాధించిన వారికి ముందుగా 1,600 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. దీనిని నిర్దిష్ట సమయంలో పూర్తి చేసిన అభ్యర్థులకు 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్ నిర్వహించారు. ఈవెంట్స్‌లో ఉత్తీర్ణత సాధించిన వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేసి ఉత్తీర్ణులైనట్లు పత్రాలను అందజేశారు. తొలిరోజు 600 మందికి గానూ 302 మంది గైర్హాజరయ్యారు. పరుగు పందెంలో గాయపడిన వారికి సిబ్బంది వెంటనే ప్రథమ చికిత్స చేయించారు.


అభ్యర్థుల ఎత్తు కొలుస్తున్న పోలీస్ సిబ్బంది


కాల్‌లెటర్ల పరిశీలన


సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

ఎస్పీ పర్యవేక్షణలో..

దేహదారుఢ్య పరీక్షల్లో ఎలాంటి అవతకవకలు జరగకుండా ఎస్పీ జి.కృష్ణకాంత్ పటిష్ట చర్యలు తీసుకున్నారు. తెల్లవారుజామున కవాతు మైదానానికి చేరుకున్న ఆయన పరీక్షలు ముగిసేంత వరకు అక్కడే ఉన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన మొదలు అన్ని విభాగాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళా అభ్యర్థులకు జనవరి 3, 4 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రిక్రూట్‌మెంట్‌లో సహాయం చేస్తామని, ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి మోసగించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు


కింద పడిపోయిన వ్యక్తిని తీసుకెళ్తున్న సిబ్బంది


పరుగు పందెం తర్వాత ఇలా..

చికెన్ వ్యర్థాలు తరలిస్తుండగా..

- మినీ లారీ స్వాధీనం
- టీడీపీ నేత చేపల గుంతలకు తీసుకెళ్తున్నట్లు ప్రచారం

ఉదయగిరి: బెంగళూరు నుంచి కావలికి మినీ లారీలో చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా సోమవారం తెల్లవారుజామున ఉదయగిరి సీఐ ఎస్.వెంకట్రావు తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ముందస్తు సమాచారంతో దుత్తలూరు మండలం నందిపాడు కూడలిలో జాతీయ రహదారిపై వెళ్తున్న లారీని పట్టుకుని ఉదయగిరికి తరలించారు. బెంగళూరు నుంచి కావలికి చికెన్ వ్యర్థాలు తరలిస్తున్నట్లు లారీలో ఉన్న సిబ్బంది తెలిపారు. 80 డ్రమ్ముల్లో సుమారు పది టన్నుల వ్యర్థాలను గుర్తించి ఉదయగిరి పట్టణ సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద గుంత తీసి అందులో పూడ్చిపెట్టారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీలో కీలకంగా ఉన్న ఓ నేతకు చెందిన చేపల గుంతలకు ఆ వ్యర్థాలను తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మినీ లారీ వద్ద పోలీస్

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): పండగ రోజుల్లో జూదం, కోడిపందేలు, అశ్లీల నృత్యాలను నిర్వహించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఆయన సోమవారం వార్షిక నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025 సంవత్సరంలో విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా అధిగమిస్తూ జిల్లా ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. నేరస్తుల కదలికలపై నిఘా పెంచడంతోపాటు కార్డన్ సెర్చ్‌లు నిర్వహించాలన్నారు. సీసీ కెమెరాల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసి వాటి ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. మత్తు పదార్థాలను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోక్సో యాక్ట్ ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది